

కనకదుర్గమ్మకు వెండి కిరీటాలు

సఖినేటిపల్లి: గ్రామంలోని కనకదుర్గమ్మ తల్లికి దండు శ్రీనివాసరాజు, అరుణకుమారి దంపతులు, కృష్ణంరాజు 1200 గ్రాముల (రూ.1.80 లక్షలు) 2 వెండి కిరీటాలు సమర్పించారు.



హడలెత్తిస్తున్న ధార్ గ్యాంగ్

మధ్యప్రదేశ్‌కు చెందిన దొంగల ముఠా ధార్ గ్యాంగ్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో హల్‌చల్ చేస్తోంది. ఒంటరి మహిళలు, తాళాలు వేసిన ఇళ్లే దీని టార్గెట్. - 8లో

డెల్టాలకు నీటి విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు ఆదివారం 10,300 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 3,900, మధ్య డెల్టాకు 1,400, పశ్చిమ డెల్టాకు 5,000 క్యూసెక్కుల చొప్పున వదిలారు.

న్యూస్‌రీల్

మహిషాసుర మర్దినికి దండ వేసేందుకు వేలం

రూ.1.05 లక్షలకు పాడుకున్న వైనం

అమలాపురం టౌన్: స్థానికంగా జరిగే ఏడు వీధుల దసరా ఉత్సవాల్లో ఒకటైన రవణం వీధి వాహనం మహిషాసుర మర్దిని అమ్మవారి మెడలో వేసే తొలి పూల దండకు ఏటా వేలం పాట నిర్వహిస్తుంటారు. ఇందులో భాగంగానే రవణం వీధిలోని మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయం వద్ద దండకు ఆ వీధి ఆలయ కమిటీ, ఉత్సవ కమిటీ ప్రతినిధులు ఆదివారం వేలం పాట నిర్వహించారు. అమలాపురానికి చెందిన ప్రస్తుతం హైదరాబాద్‌లో స్థిర పడ్డ ఆకుల లక్ష్మణ రావు కుటుంబం దండను రూ.1.05 లక్షలకు పాడుకున్నారు. ఈ దండనే అక్టోబర్ రెండో తేదీన జరిగే రవణం వీధి దసరా ఉత్సవాలు, ఊరేగింపు వేళ అమ్మవారి మెడలో లక్ష్మణరావు కుటుంబీకులు వేయనున్నారు. ఇదే ఆకుల లక్ష్మణరావు గత ఏడాది దసరా ఉత్సవాల సమయంలో నిర్వహించిన వేలం పాటలో అమ్మవారి దండను రూ.1.03 లక్షలకు పాడుకున్నారు.

గణపతి ఆలయానికి భక్తుల తాకిడి



విశేషాలంకరణలో అయినవిల్లి విఘ్నేశ్వరస్వామి

అయినవిల్లి: ప్రసిద్ధి చెందిన అయినవిల్లి విఘ్నేశ్వర స్వామివారిని ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావు ఆధ్వర్యంలో స్వామికి తెల్లవారు జామున మేలు కొలుపు సేవ, పంచామృతాభిషేకం, ఏకాదశ, లఘున్యాస పూర్వక అభిషేకాలు, శ్రీలక్ష్మీగణపతి హోమం, గరిక పూజ నిర్వహించారు. అర్చకులు స్వామిని వివిధ పుష్పాలతో అలంకరించారు. మహా నివేదన చేశారు. రాత్రి ఎనిమిది గంటలకు స్వామికి విశేష సేవలు చేసి ఆలయ తలుపులు వేశారు. లఘున్యాస ఏకాదశ రుద్రాభిషేకాల్లో 59 మంది పాల్గొన్నారు. 12 మంది భక్తులు ఉండ్రాళ్ల పూజ జరిపారు. స్వామివారి పంచామృతాభిషేకాల్లో రెండు జంటలు పాల్గొన్నాయి. నలుగురికి అక్షరాభ్యాసాలు నిర్వహించారు. శ్రీ లక్ష్మీగణపతి హోమంలో 27 జంటలు పాల్గొనగా, నలుగురు చిన్నారులకు తులాభారం నిర్వహించారు. స్వామికి ఏడుగురు భక్తులు తలనీలాలు సమర్పించారు. 55 మంది వాహన పూజలు చేయించుకున్నారు. 3,120 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆదివారం ఒక్క రోజు స్వామివారికి వివిధ పూజ టిక్కెట్లు, అన్నదాన విరాళాల ద్వారా రూ.3,50,947 ఆదాయం లభించినట్లు ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు.

లోపభూయిష్టంగా మెగా డీఎస్సీ

– న్యాయ పోరాటం చేస్తాం

అమలాపురం రూరల్: ఇటీవల నిర్వహించిన మెగా డీఎస్సీ లోపభూయిష్టంగా జరిగిందని రాష్ట్రవ్యాప్తంగా సెలక్షన్ కమిటీ మెరిట్లో వచ్చిన ఎస్సీ అభ్యర్థులకు రిజర్వేషన్‌లో అన్యాయం జరిగిందని ఆర్‌పీఐ రాష్ట్ర అధ్యక్షుడు డీబీ లోక్ అన్నారు. అమలాపురం బుద్ధవిహార్‌లో ఆదివారం డీఎస్సీ అభ్యర్థుల సమావేశం గోసంగి గోపాలకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఎస్సీ, ఎస్టీలను ఓపెన్ కేటగిరిలోనికి తీసుకోకుండా ప్రభుత్వం అన్యాయం చేసిందన్నారు. దీనిపై న్యాయ పోరాటం చేస్తామని చెప్పారు. 50శాతం ఉద్యోగాలను కులాలకు అతీతంగా ఓపెన్ కేటగిరిలో భర్తీ చేయవలసి ఉందని కానీ ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఎక్కువ మార్కులు సంపాదించినా వారిని రిజర్వుడు కేటగిరిలోనే పరిగణనలోకి తీసుకొని అన్యాయం చేశారని సమావేశం తెల్పింది. బీసీ అభ్యర్థులు వారి రిజర్వేషన్లలో సెలక్ట్ అయిన అభ్యర్థులను ఓపెన్ కేటగిరిలో చూపించారని అన్నారు. ఈ సమావేశంలో ములపర్తి సత్యనారాయణ, మాజీ సర్పంచ్, కాశీ వెంకటేశ్వరరావు, ఎంప్లాయిస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు చిలకపాటి సాంబశివరావు పాల్గొన్నారు.

వాడపల్లి వెంకన్న బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక ఆవిష్కరణ

కొత్తపేట: కోనసీమ తిరుమలగా, భక్తుల కోర్కెలు తీర్చే ఏడు శనివారాల వెంకన్నగా ప్రసిద్ధి చెందిన ఆత్రేయపురం మండలం వాడపల్లి క్షేత్రంలో వేంచేసియున్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి 13 వ వార్షిక బ్రహ్మోత్సవాలు వచ్చే నెల 10వ తేదీ నుంచి 18 వరకూ జరగనున్నాయి. ఆ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఆదివారం సాయంత్రం దేవదాయ – ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, దేవస్థానం ఈఓ నల్లం సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డీసీ అండ్ ఈఓ చక్రధరరావు మాట్లాడుతూ 9 రోజుల పాటు నిర్వహించే బ్రహ్మోత్సవాల కార్యక్రమాలు, సేవలు, స్వామివారి ఊరేగింపుల గురించి వివరించారు. వేంకటేశ్వరస్వామివారి దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగులకు పీఎఫ్, రూ 20 లక్షల ఆరోగ్య బీమా సౌకర్యం కల్పిస్తున్నట్టు ఎమ్మెల్యే సత్యానందరావు ప్రకటించారు.

బ్రిటిషర్లను భయపెట్టిన...

చెడీ తాలింఖానా



చెడీ తాలింఖానా ప్రదర్శనలు

- కోనసీమలో దసరా ప్రత్యేకం
- స్వాతంత్య్ర ఉద్యమ స్ఫూర్తితో 169 ఏళ్లుగా సాగుతున్న ప్రదర్శన
- ఇటీవల కాలంలో పెరిగిన ఆదరణ
- ఎన్‌ఆర్‌ఐలతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి రాక
- మైసూర్ తరువాత... 'పచ్చని సీమ'లోనే 'దసరా' శోభ
- సంక్రాంతికి ప్రభల తీర్థం.. దసరాకు చెడీ తాలింఖానా

సాక్షి, అమలాపురం/అమలాపురం టౌన్ : కోనసీమ అనగానే ప్రకృతి అందాలు, పర్యాటక కేంద్రాలకే కాదు.. సంస్కృతీ సంప్రదాయాలకు.. ఆధ్యాత్మికతకు పెట్టింది పేరు. సంక్రాంతి వస్తే పల్లె ముస్తాబవుతుంది. నింగిలోని ఇంద్ర ధనస్సులు 'ప్రభ'లుగా మారి నేలన నడయాడతాయి. తీర్థాలతో ఈ ప్రాంతం హోరెత్తుతుంది. ఇక దసరా వస్తే చెడీ తాలింఖానా ప్రదర్శన.. అమ్మవార్ల వాహనాల ఊరేగింపులతో జనజాతరగా మారిపోతుంది. చెడీ తాలింఖానా... ఒకప్పుడు స్వాతంత్య్ర పోరాట స్ఫూర్తితో నేర్చుకున్న విద్య రానురానూ ప్రజల సంప్రదాయ కళలలో ఒక భాగమైంది.

శతాబ్దాల చరిత్ర

అజ్ఞాతం ముగిసిన తరువాత జమ్మి చెట్టు మీద ఉన్న పాండవుల ఆయుధాలు చేతులకు వచ్చినట్టుగా ఇక్కడ దసరాకు ముందు దాచి ఉంచిన కత్తులు కొత్తగా పదునెక్కుతాయి. బరిసెలు బయటకు వస్తాయి. రాత్రి వేళల్లో అగ్గిబరాటాలు నిప్పులు కక్కుతాయి. లేడి కొమ్ములు, పొడవాటి కర్రలు కళాత్మకంగా తిరుగుతుంటాయి. ఆపై అమ్మవారి ఊరేగింపులతో కోనసీమలో దసరా కొత్త పుంతలు తొక్కుతుంది. దసరా ఉత్సవాలు కర్ణాటకలోని మైసూరు తరువాత అమలాపురంలో ఇంచుమించు రెండు శతాబ్దాల నుంచి జరుగుతున్నాయంటే అతిశయోక్తి కాదు. ప్రాచీన యుద్ధాలను తలపించే చెడీ తాలింఖానా వీరత్వానికి మారుపేరుగా నిలుస్తోంది. శతాబ్దాల చరిత్ర ఉన్న తాలింఖానాకు నేటికీ ఆదరణ చెక్కు చెదరలేదు. కర్రలు, కత్తులు, లేడి కొమ్ములతో వారు చేసే ప్రదర్శన ప్రేక్షకులను గగుర్పాటుకు గురిచేస్తాయి. యువకుల నుంచి వృద్ధుల వరకు వయోభేదం మరచి చేసే తాలింఖానా విన్యాసాలు వీక్షకులను మంత్రముగ్ధులను చేస్తాయి. అన్ని వీధులు ఈ ప్రదర్శనలతో నిండిపోతాయి. ఇంచుమించు నెల రోజుల ముందు నుంచే ఈ ప్రదర్శనకు అవసరమైన శిక్షణ పొందుతారు. కొత్త తరం కూడా ఈ విద్యా ప్రదర్శనకు ఉత్సాహంగా ముందుకు రావడం విశేషం.

మంత్ర ముగ్ధులను చేసేలా..

దసరా ఉత్సవాలలో భాగంగా పురవీధుల్లో చెడీ తాలింఖానా ప్రదర్శన జరుగుతుంది. ఈ ఏడాది అక్టోబరు 2వ తేదీ రాత్రి అంతా ఈ కార్యక్రమం జరుగనుంది. వీధుల్లో యువకులు, పెద్దలు ప్రాచీన యుద్ధవిన్యాసాలను తలపించేలా ప్రదర్శించే చెడీతాలింఖానా విద్య ఉద్విగ్నభరితంగా సాగుతుంది. కళ్లకు గంతలు కట్టుకుని మనిషి మీద, కంఠం, నుదిటిపై, పొత్తి కడుపుల మీద



చెడీ తాలింఖానా ప్రదర్శనలు

కొబ్బరికాయలు, కాయగూరలు పెట్టి నరకడం వంటి విన్యాసాలు తాలింఖానాలో ముఖ్య ఘట్టాలు. అగ్గిబరాటాలు, లేడికొమ్ములు, పట్టాకత్తులు వేగంగా.. చురుగ్గా కదుపుతూ యువకులు చేసే విన్యాసాలు రాచరిక యుద్ధ సన్నాహాలను తలపిస్తాయి. ఈ ప్రదర్శనలో ఏమాత్రం ఏమరుపాటు జరిగినా ప్రాణాలకు ప్రమాదం. అయినా కూడా అత్యంత ధైర్య సాహసాలతో శిక్షణ పొందిన ఆరేళ్ల చిన్నారుల నుంచి అరవై ఏళ్ల వృద్ధుల వరకు చేసే ప్రదర్శన మంత్ర ముగ్ధులను చేస్తుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగులైనా, ఎన్‌ఆర్‌ఐలైనా ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు రెక్కలు కట్టుకుని వాలిపోతుంటారు.

అమలాపురంలో చెడీ తాలింఖానా విద్య ప్రదర్శన వెనుక స్వాతంత్య్ర పోరాట ఉద్యమ స్ఫూర్తి ఉందని స్థానికులు చెబుతుంటారు. బ్రిటిష్ సేనలతో పోరాడే భారతీయుల్లో ఐక్యత కోసం బాలగంగాధర్ తిలక్ దసరా, వినాయక చవితి ఉత్సవాలను ప్రోత్సహించారు. ఈ విద్య స్థానికంగా 1835 కొంకాపల్లిలో మొదలైంది. అయితే దసరా వేడుకలలో 1856లో మహిపాల వీధిలో రైతుబిడ్డ, స్వాతంత్య్ర సమరయోధుడు అబ్బిరెడ్డి రామదాసు ఈ విద్యకు అంకురార్పణ చేశారు. ఇది ఇక్కడ ప్రారంభమై 190 సంవత్సరాలు అవుతోంది. అప్పటి నుంచి ఈ ప్రదర్శన నిర్విఘ్నంగా సాగుతోంది. వీటితోపాటు గండువీధి మైనర్స్ పార్టీ, నల్లా వీధి, శ్రీరామపురం మైనర్స్ పార్టీ, రవణం మల్లయ్య వీధి తాలింఖానా ప్రదర్శనలకు దశాబ్దాల చరిత్ర ఉంది. చెడీ తాలింఖానా ప్రదర్శనతోపాటు పట్టణానికి చెందిన ఏడు వీధులలో కొలువు తీరిన వాహనాలను ఊరేగింపులో ప్రదర్శిస్తారు. బాజాభజంత్రీలు, డప్పువాయిద్యాలు, శక్తి వేషధారణలు, కోయడ్యాన్సులు, బుట్టబొమ్మలు, మ్యూజికల్, తీన్‌మార్ బ్యాండ్‌లు, విద్యుత్ దీపాలంకరణలతో వాహనాలు ముందుకు సాగుతాయి. కొంకాపల్లి ఏనుగు అంబారీ వాహనం, ఆంజనేయస్వామి వాహనం, మహిపాలవీధి రాజహంస, గండువీధి శేషశయన, రవణం వీధి మహిషాసుర మర్దిని, రవణం మల్లయ్యవీధి గరుడ విష్ణు, నల్లా వీధి శ్రీవిజయ దుర్గమ్మవారు వాహనం, శ్రీరామపురం హంస, శ్రీకృష్ణుడు, వినాయక వాహనాలు పురవీధుల్లో ఊరేగింపుగా వెళతాయి. జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి, తెలంగాణా ప్రాంతం నుంచి కూడా ఈ ఉత్సవాలను తిలకించేందుకు అమలాపురానికి తరలివస్తారు.



దసరా ఉత్సవాలలో అమ్మవారి ఊరేగింపు

తరతరాలుగా నిర్వహిస్తున్నాం



దశాబ్దాల కాలం నుంచి అమలాపురంలో ఈ ప్రదర్శన జరుగుతోంది. మా తాతలు మాకు వారసత్వంగా అందించారు. మేము మా వారసులకు ఈ విద్యను అందిస్తాం. ఈ ప్రాచీన విద్యను ప్రభుత్వాలు గుర్తించాల్సి ఉంది.

– పనస బుజ్జి, నిర్వహకుడు, కొంకాపల్లి, అమలాపురం

రోజుకు ఎనిమిది గంటల శిక్షణ



దసరాకు ముందు ఆయుధ పూజ చేసిన తరువాత సాయంత్రం ఆరు గంటల నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు శిక్షణ ఇస్తాం. రోజుకు 150 నుంచి 250 మంది వరకు గురువుల వద్ద శిక్షణ పొందుతారు. ఎక్కువగా చిన్నారులు, యువత రావడం వల్ల భవిష్యత్‌లో కూడా ఈ ప్రదర్శన నిర్విఘ్నంగా సాగుతుందనే ఆశ మాకుంది.

– అబ్బిరెడ్డి మల్లేష్, నిర్వాహకుడు, మహిపాల వీధి, ఎన్‌ఆర్‌ఐ (అమెరికా)

కాజ్‌వేలపై వరద

– ఐదవసారి లంకవాసులకు ఇబ్బందులు

సాక్షి, అమలాపురం: గోదావరి లంక గ్రామాలను ఈ ఏడాది ఐదవసారి వరద ముంచెత్తుతోంది. భారీ వరదలు లేకున్నా వరుసగా వస్తున్న వరదలు స్థానికులు, లంక వాసులను ఇబ్బందులు పాల్జేస్తోంది. సెప్టెంబర్ నెలలో వరద మూడవసారి రావడం అత్యంత అరుదు. గోదావరి పరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు మరోసారి వరద పోటెత్తింది. ధవళేశ్వరం బ్యారేజీ నుంచి శనివారం మధ్యాహ్నం మొదలైన వరద ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు పెరుగుతూనే ఉంది. ఆరు గంటలకు 10.78 లక్షల క్యూసెక్కులు వరద నమోదు కాగా, ఏడు గంటల వరకు అదే నిలకడగా ఉంది. తరువాత నుంచి నెమ్మదిగా వరద తగ్గుతోంది. మధ్యాహ్నం 12 గంటల సమయంలో 10.71 లక్షల క్యూసెక్కులకు వరద తగ్గింది. తరువాత నుంచి క్రమేపీ వరద తగ్గుముఖం పడుతోంది. రాత్రి తొమ్మిది గంటల సమయానికి 10.01 లక్షల క్యూసెక్కులకు వరద తగ్గింది. అయితే మధ్యాహ్న సమయం నుంచి ఎగువన భద్రాచలం వద్ద వరద పెరుగుతుండడంతో దిగువన ముంపు వీడే అవకాశం లేదని అంచనా వేస్తున్నారు.

గోదావరి వరదకు జిల్లాలోని లంక గ్రామాల్లో ముంపు తీవ్రత పెరిగింది. కాజ్‌వేలు, లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లు, పంట పొలాలు, తోటల్లో వరద నీరు చేరింది. పి.గన్నవరం మండలంలో కనకాయిలంక కాజ్‌వేపై వరద ముంపు మరింత పెరిగింది. ఈ మండలాన్ని ఆనుకుని ఉన్న అయోధ్యలంక, అనగారిలంక, శిర్రావారిలంక, పెదమల్లంక పడవల మీద రాకపోకలు సాగిస్తున్నారు. అప్పనపల్లి కాజ్‌వే నీట మునిగింది. పెదపట్నంలంక, అప్పనపల్లి, దొడ్డవరం ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అయినవిల్లి మండలం ముక్తేశ్వరం ఎదురుబిడియం కాజ్‌వే నీట మునగడంతో ఇక్కడ పడవల మీద జనం రాకపోకలు సాగిస్తున్నారు. సఖినేటిపల్లి– నర్సాపురం రేవు మూసివేసి రాకపోకలు నిలిపివేశారు. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేలంక మత్స్యకార కాలనీ నీట మునిగింది. కూనాలంక, గురజాపులంక, చింతావానిరేవు, చింతపల్లిలంకల్లో వరద నీరు చేరడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఐ.పోలవరం మండలం అన్నంపల్లి అక్విడెక్టును తాకుతూ వరద ప్రవహిస్తోంది. కాట్రేనికోన మండలం పల్లంకుర్రు రేవు వద్ద ఇళ్ల మధ్యకు వరద నీరు వచ్చి చేరింది. అల్లవరం మండలం బోడసుకుర్రు పల్లిపాలెంలో మత్స్యకార ఇళ్ల చుట్టూ వరద నీరు చేరుతోంది.



అన్నంపల్లి అక్విడెక్టు వద్ద వరద ఉధృతి

హోం మంత్రి, డీజీపీ రాజీనామా చేయాలి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి డిమాండ్

కొత్తపేట: రాష్ట్రంలో ప్రజలకు రక్షణ కల్పించడంలో పోలీసు శాఖ వైఫల్యం, దానిని న్యాయ స్థానం ధ్రువీకరించిన నేపథ్యంలో హోంమంత్రి, డీజీపీ తక్షణం రాజీనామా చేయాలని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి డిమాండ్ చేశారు. కొత్తపేటలో పార్టీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు స్వగృహంలో డిజిటల్ బుక్ క్యూ ఆర్ కోడ్ పోస్టర్స్‌ను జగ్గిరెడ్డి, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎంపీ చింతా అనురాధ ఆవిష్కరించారు. రాష్ట్రంలో పాలనను గాలికి వదిలేసిన కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పడానికి, కార్యకర్తలకు అండగా ఉండడానికి డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించినట్టు జగ్గిరెడ్డి తెలిపారు. రాష్ట్రంలో కార్యకర్తలకు వచ్చిన ఇబ్బందులను పరిష్కరించేందుకు ఈ డిజిటల్ బుక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శాంతిభద్రతలు కాపాడవలసిన పోలీస్ శాఖ ప్రజలకు రక్షణ కల్పించడంలో విఫలం అయిందన్నారు. రాష్ట్రంలో ఒక సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ను అరెస్ట్ చేసి కొంతమంది కూటమి నాయకుల తొత్తుల కింద పనిచేస్తున్న పోలీసు అధికారులు అబద్ధం ఆడటంతో పాటు కోర్టుకు కూడా తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. సోషల్ మీడియా యాక్టివిస్ట్‌ను అరెస్టు చేసి, చేయలేదంటూ పోలీసులు చెప్పడంపై హైకోర్టు న్యాయమూర్తులు సీబీఐ ఎంక్వైరీకి ఆదేశించారన్నారు. ఈ నేపథ్యంలో హోమ్ మినిస్టర్ తో పాటు, డీజీపీ కూడా రాజీనామా చేయాలని జగ్గిరెడ్డి కోరారు.

స్వార్థ పూరితంగా చంద్రబాబు పాలన

రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలోని కూటమి పాలన స్వార్థపూరితంగా సాగుతోందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు విమర్శించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం పేద, సామాన్య వర్గాలకు అందుబాటులో ఉండేలా 17 మెడికల్ కాలేజీలకు శ్రీకారం చుట్టి, అనేక కాలేజీలు ప్రారంభిస్తే, నేటి సీఎం చంద్రబాబు వ్యక్తిగత స్వార్థప్రయోజనాల కోసం వాటి ప్రైవేటీకరణకు చర్యలు తీసుకున్నారని ఆరోపించారు. శాసనసభ, శాసనమండలి గౌరవాన్ని దిగజార్చారని విమర్శించారు. మాజీ సీఎంను దుర్భాషలాడటాన్ని ఖండించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముసునూరి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు ముత్యాల వీరభద్రరావు, సీనియర్ నాయకులు కర్రి నాగిరెడ్డి, గొలుగూరి మునిరెడ్డి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి లక్ష్మీపతిరావు, సర్పంచ్‌లు రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, దూనబోయిన నవదీప, జిల్లా పార్టీ కార్యవర్గ సభ్యుడు షేక్ వల్లీబాబా, ఎంపీటీసీ సభ్యురాలు పితాని లక్ష్మీతులసి పాల్గొన్నారు.



డిజిటల్ బుక్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జగ్గిరెడ్డి, మాజీ మంత్రి సూర్యారావు, మాజీ ఎంపీ అనూరాధ

సర్కారీ చోద్యానికి సమ్మె వైద్యం

- సర్వీస్ కోటా అమలుపై వైద్యుల్లో తీవ్ర అసంతృప్తి
- హక్కుల సాధనకు నేటి నుంచి విధుల బహిష్కరణ
- ప్రభుత్వం దిగి రాకుంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరిక

ఆలమూరు: శరీరంలో రుగ్మతలు తలెత్తితే వైద్యులు తమ మేధా సంపత్తిని ఉపయోగించి మెరుగైన చికిత్స ద్వారా రోగిని సంపూర్ణ ఆరోగ్యవంతుడిగా తీర్చిదిద్దుతారు. అదే రీతిలో అస్తవ్యస్త నిర్ణయాలను తీసుకున్న పాలకులను దారిలో పెట్టాలంటే సమ్మె అనే చికిత్స అవసరమని రాష్ట్ర పీహెచ్‌సీ డాక్టర్స్ అసోసియేషన్ (ఏపీపీహెచ్‌సీడీఏ) భావిస్తోంది. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రభుత్వ రంగ సంస్థలు, ఉద్యోగుల పట్ల అంతులేని నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది. ఇప్పటికే ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాలు నిరసన బాట పట్టగా గ్రామ, వార్డు సచివాలయ, సర్వశిక్ష అభియాన్ సిబ్బంది తమ హక్కుల సాధనపై పోరాడుతున్నారు. ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజల్లోను, ఉద్యోగుల్లోను తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా రాష్ట్ర ప్రభుత్వానికి చలనం లేకుండా పోయిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 54 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉండగా అందులో 47 గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 07 పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఉన్నాయి. అందులో ప్రస్తుతం 97 మంది వైద్యులు పని చేస్తుండగా ప్రతి రోజూ సుమారు ఐదు వేల మందికి చికిత్సను అందిస్తున్నారు. దీంతో పాటు చంద్రన్న సంచార చికిత్స, స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు క్షేత్రస్థాయిలో ఆరోగ్య సేవలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించి డీఎంహెచ్‌ఓ కార్యాలయానికి నిత్యం నివేదికలను అందచేస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో క్షణం తీరిక లేకుండా విధులు నిర్వహించే పీహెచ్‌సీ వైద్యుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు ఆక్షేపణీయమనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.



పెదపళ్ల పీహెచ్‌సీలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యుడు (ఫైల్)

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో..

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం వైఎస్ జగన్ పేద ప్రజల అభ్యున్నతి కోసం వైద్య ఆరోగ్యశాఖలో విప్లవాత్మక మార్పులు తీసుకువచ్చి గ్రామీణ ఆరోగ్య వ్యవస్థను బలోపేతం చేశారు. పీహెచ్‌సీలో కచ్చితంగా ఇద్దరు వైద్యులతో పాటు 14 మంది సిబ్బందిని నియమించి గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు రూపకల్పన చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ప్రైవేట్ ఆస్పత్రులను ప్రోత్సహించే చర్యలు తీసుకుంటూ పేద ప్రజల ఆరోగ్యానికి తూట్లు పొడిచే విధంగా నిర్ణయాలను తీసుకుంటోంది. గత ఏడాది సెప్టెంబర్‌లో పోరుబాట పడితే క్లినికల్ విభాగంలోని సీట్లను 20 శాతానికి పెంచుతూ నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం మళ్లీ ఈ ఏడాది పాత విధానమే అమలు చేస్తున్నానని చెప్పడం పీహెచ్‌సీ వైద్యుల ఆగ్రహానికి ప్రధాన కారణమైంది. వాతావరణంలో సంభవిస్తున్న మార్పులతో పాటు విష జ్వరాలు విజృంభిస్తున్న తరుణంలో పీహెచ్‌సీ వైద్యులు సమ్మె చేపట్టడం పట్ల ప్రజల్లో తీవ్ర ఆందోళన నెలకొంది.

రాష్ట్ర పీహెచ్‌సీడీఏ ఉద్యమ కార్యాచరణ

జిల్లా వ్యాప్తంగా పీహెచ్‌సీ వైద్యులు తమ న్యాయపరమైన డిమాండ్ల సాధనకు రాష్ట్ర పీహెచ్‌సీడీఏ పిలుపు మేరకు ఉద్యమ కార్యాచరణను సిద్ధం చేసి అమలు దిశగా చర్యలు చేపట్టారు. ఇప్పటికే పీహెచ్‌సీ వైద్యులు ఈ నెల 26న ఆన్‌లైన్ రిపోర్టింగ్, అధికారిక పర్యటనలను నిలిపివేయగా 27న చంద్రన్న సంచార చికిత్స, స్వస్థ నారీ సశక్తి పరివార్ అభియాన్‌ను బహిష్కరించి కేవలం పీహెచ్‌సీలోని విధులకు పరిమితమయ్యారు. 28న ప్రభుత్వ అధికారిక వాట్సాప్ గ్రూపుల నుంచి వైదొలగి నిరసనలు తెలియజేశారు. అయినా ప్రభుత్వం దిగిరాకపోవడంతో సోమవారం నుంచి పీహెచ్‌సీ విధులను బహిష్కరించి కేవలం అత్యవసర సేవలకు మాత్రమే పరిమితమవుతూ ప్రత్యక్ష కార్యాచరణకు సిద్ధమవుతున్నారు. ఈ నెల 30న జిల్లా స్థాయిలో నిరసనలను తెలుపుతామని ప్రకటించారు. అమలాపురంలో పీహెచ్‌సీ వైద్యులందరూ అక్టోబర్ ఒకటో తేదీన భారీ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. రాష్ట్ర పీహెచ్‌సీ డీఏ ఐక్యవేదిక పిలుపు మేరకు అక్టోబర్ రెండో తేదీన చలో విజయవాడకు తరలివెళ్లనున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకుంటే అక్టోబర్ మూడు నుంచి నిరవధిక నిరసన దీక్షలకు దిగుతామని ఐక్యవేదిక హెచ్చరించింది.

పీహెచ్‌సీ వైద్యుల డిమాండ్లు ఇవీ..

- ఇన్ సర్వీస్‌లోనున్న పీహెచ్‌సీ వైద్యులకు పీజీ సీట్ల కోటాను పునరుద్ధరించాలి.
- కౌన్సెలింగ్ విషయంలో అర్బన్ అండ్ నేటివిటీపై ఉన్న గడువును ఆరేళ్ల నుంచి ఐదేళ్లకు కుదించాలి.
- గిరిజన ప్రాంతాల్లో పనిచేసే వైద్యులకు బేసిక్‌పై 50 శాతం అదనంగా అలవెన్స్ ఇవ్వాలి.
- చంద్రన్న సంచార చికిత్సలో పాల్గొనే వైద్యులకు రూ.ఐదు వేలు అలవెన్స్‌గా ఇవ్వాలి.
- పీహెచ్‌సీ వైద్యులందరికీ సీహెచ్‌సీ వైద్యుల మాదిరిగానే మూడేళ్లకు పదోన్నతులు కల్పించాలి.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం



పీహెచ్‌సీ వైద్యుల సమ్మె నోటీస్ ఇచ్చిన నేపథ్యంలో ప్రజలకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశాం. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం వైద్యులతో చర్చలు జరుపుతున్న కారణంగా సమ్మె ఉండదని భావిస్తున్నాం. ఒకవేళ వైద్యులు విధులు బహిష్కరిస్తే మాత్రం పీహెచ్‌సీల్లోని మిగతా విభాగాల్లో పనిచేసే వైద్య ఆరోగ్య సిబ్బందితో పరిపూర్ణంగా సేవలను అందిస్తాం.

కె.దుర్గారావు దొర, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్త కొబ్బరి (క్వింటాల్)	20,000 – 21,500
కొత్త కొబ్బరి (రెండో రకం)	10,500 – 12,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	31,500
గటగట (వెయ్యి)	30,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	30,000
గటగట (వెయ్యి)	28,500
నీటికాయ	
పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	23,000 – 24,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	5,250
కిలో	350

క్లుప్తంగా

నేతన్నలకు బకాయిల వెతలు




అంగరలో నిరసన ర్యాలీ చేస్తున్న నేత కార్మికులు

కపిలేశ్వరపురం: తమ శ్రమతో స్థాపించిన చేనేత సహకార సంఘం నిర్వహణకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు గుదిబండలా మారాయంటూ అంగర చేనేత కార్మికులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ప్రభుత్వానికి విన్నవించినా ఫలితం లేకపోవడంతో ఆందోళనకు పూనుకున్నారు. అంగరలోని శ్రీగణపతి చేనేత పారిశ్రామికుల సంఘం రెండు జాతీయ స్థాయి అవార్డులను సాధించింది. మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, మాజీ సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి చేతులు మీదుగా ప్రశంసా పత్రాలను అందుకుంది. అలాంటి సంఘానికి ప్రభుత్వం నుంచి రూ.3,85,18,292 బకాయిలు రావాల్సి ఉంది. అందులో రూ.1,00,11, 858 ఆప్కో సంస్థ చెల్లించాల్సి ఉంది. పాలకులు పట్టించుకోకపోవడంతో కార్మికులు ఆందోళన బాట పట్టారు. గ్రామంలో ఆదివారం నిరసన ర్యాలీ చేశారు. చేనేత సహకార సంఘం ఎదుట సుమారు 100 మంది రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. నాయకులు మాట్లాడుతూ ఆప్కో ద్వారా బకాయిలను చెల్లించాలని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆప్కో బకాయిలకు తోడు మరిన్ని పథకాల ద్వారా రావాల్సిన బకాయిలు సైతం సంఘం నిర్వహణకు సమస్యగా మారాయన్నారు. తమ డిమాండ్‌ను పరిశీలించి పరిష్కరించే వరకూ ఆందోళనను కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. వారికి పలువురు ప్రజా సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు.

గుండె లయ తప్పుతోంది

- కరోనాతో మరింత పెరిగిన గుండెపోటు బాధితులు
- ఆహారపు అలవాట్లు అదుపు చేసుకుంటేనే మంచిది
- నేడు వరల్డ్ హార్ట్ డే



వరల్డ్ హార్ట్ డే లోగో

రాయవరం: ఇటీవలి కాలంలో ఎవరైనా అకస్మాత్తుగా మరణిస్తే ఎలా చనిపోయారు అని ప్రశ్నించగానే ఎక్కువగా వినిపించే సమాధానం గుండెపోటు. వయసుతో సంబంధం లేకుండా చోటు చేసుకునే మరణాల్లో హార్ట్ ఎటాక్‌తో జరిగేవే అధికం. మన శరీరానికి పెద్దదిక్కుగా వ్యవహరించే హృదయం లయ తప్పకుండా జాగ్రత్తలు తీసుకోవడం ఎంతో అవసరం. సోమవారం వరల్డ్ హార్ట్ డే సందర్భంగా 'సాక్షి' ప్రత్యేక కథనం..

అతి ప్రధానమైన అవయవం

మనిషి శరీరంలో పనిచేసే అవయవాల్లో అతి ప్రధానమైనది గుండె. దీనికి ప్రస్తుత పరిస్థితుల్లో భద్రత లేకుండా పోతోంది. వ్యాయామం లేకపోవడం, సమయానికి భోజనం చేయకపోవడం. పొగ తాగడం, ఒత్తిళ్లతో గుండెపోటుకు గురవుతున్నారు. మనుషుల్లో మారుతున్న అలవాట్లు, ఊబకాయం, మధుమేహం, అధిక రక్తపోటు, మూత్రపిండాల సమస్యలకు దారి తీయడంతోపాటు అంతిమంగా గుండెపై ప్రభావం పడుతోంది. అయితే మధుమేహం (సుగర్)తోనే అధిక ముప్పు ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

యువకుల నుంచి వృద్ధుల వరకు

రెండు దశాబ్దాల కిందట 50 ఏళ్లు దాటిన వృద్ధులకు మాత్రమే వచ్చే గుండెపోటు, మారిన జీవన శైలి కారణంగా నేడు 20 ఏళ్ల యువకుల నుంచి 70 ఏళ్ల వృద్ధుల వరకు వస్తోంది. వీరిలో 30 ఏళ్ల వయసువారే ఎక్కువ మంది ఉంటున్నారు. దీనికి కారణం అధిక ఒత్తిడి, ధూమపానం, మద్యం, సుగర్, ఫాస్ట్ ఫుడ్ , లావు పెరగడం, శరీరంలో చెడు కొలెస్ట్రాల్, నిద్రలేమి, అధికంగా ఫోన్ చూడడం, ప్యాక్డ్ ఫుడ్‌ను అధికంగా తీసుకోవడం, మితిమీరి శీతలపానీయాలు తాగడం, తరచుగా ఆయిల్ ఫుడ్‌ను తీసుకోవడం.

జిల్లాలో 14 శాతం బాధితులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో గుండె సంబంధిత సమస్యలతో బాధపడేవారు 14 శాతం ఉన్నట్లు అంచనా. ఆకస్మిక హృద్రోగ సమస్య ఎదురైన వారిలో 10 శాతం మంది మాత్రమే చికిత్స పొంది, కోలుకుంటున్నారు. హైపర్ టెన్షన్‌తో ఇబ్బంది పడేవారు 1.06 లక్షల మంది, సుగర్ వ్యాధిగ్రస్తులు 43వేల మంది ఉన్నారు.

కోవిడ్–19తో పెరిగిన కేసులు

జిల్లాలో కోవిడ్ వైరస్ వల్ల గుండె సమస్యలు 50 నుంచి 60 శాతానికి పెరిగాయి. గతంలో అధిక కొలెస్ట్రాల్, బీపీ, సుగర్, మద్యం, సిగరెట్ వల్ల ఈ సమస్య ఉండేది. గుండె నొప్పి, అధిక ఆయాసం ఉంటే వెంటనే కార్డియాలజిస్టును సంప్రదించి, చికిత్స తీసుకోవాలి.

ఈ జాగ్రత్తలు పాటించాలి

- మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి.
- జీవనశైలి, ఆహారపు అలవాట్లను మార్చుకోవాలి.
- ఆహారంలో సాధ్యమైనంతవరకు పీచు పదార్థాలు ఎక్కువగా ఉండేలా చూసుకోవాలి.
- రక్తపోటు, మధుమేహాన్ని అదుపులో ఉంచుకునేందుకు రోజుకు కనీసం 20 నుంచి 45 నిమిషాలు వ్యాయామం చేయాలి.
- బీపీని అదుపులో ఉంచుకోవాలి.
- పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా విటమిన్ లోపాలను అధిగమించవచ్చు.
- మాంసం, కొవ్వు పదార్థాలకు సాధ్యమైనంత దూరంగా ఉండాలి.
- పార్కులు, ఇతర ఆహ్లాదకరమైన వాతావరణంలో గడపడం ద్వారా ఒత్తిడిని జయించాలి.

ఆందోళనకరంగా గుండెపోటు



గుండె రక్తనాళాలు మూసుకుపోయి రక్తం సరఫరా తగ్గిపోవడం వల్లనే ఛాతిలో నొప్పి వస్తుంది. ఛాతిలో బరువుగా అనిపించడం, మెడ భాగం నుంచి మొదలై, ఎడమ చేతి వరకు లాగడం, నొప్పి వీపు వెనక భాగంలో రావడం, ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు పట్టడం, కడుపులో మంట రావడం జరుగుతాయి. ఈ లక్షణాలు ఉండే వెంటనే వైద్యుడిని సంప్రదిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

– డాక్టర్ కారెం రవితేజ, ఎండీ ఫిజీషియన్, ఏరియా ఆస్పత్రి, అమలాపురం

ప్రతి రోజూ వ్యాయామం చేయాలి



ఫాస్ట్‌ఫుడ్, జంక్‌ఫుడ్స్ అధికంగా తినడం, వ్యాయామం లేకపోవడం వల్ల గుండె సంబంధిత వ్యాధులు వస్తాయి. తెలియకుండానే శరీరంలో కొలెస్ట్రాల్ అధిక స్థాయిలో పెరిగి, రక్తంలో బ్లాక్స్ ఏర్పడతాయి. రక్తనాళాల్లో కొవ్వు పేరుకుపోవడం వల్ల గుండె, మెదడు స్ట్రోక్స్ వస్తాయి.

– డాక్టర్ సుమలత, డిస్ట్రిక్ట్ నోడల్ అధికారి, ఎన్‌సీడీ, డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా

నన్నయ వర్సిటీ కబడ్డీ జట్టు ఎంపిక



సమావేశంలో మాట్లాడుతున్న యూనివర్సిటీ రిజిస్ట్రార్ స్వామి



అంతర్‌విశ్వవిద్యాలయాల పోటీలకు ఎంపికైన కబడ్డీ జట్టు

పెదపూడి: జి.మామిడాడ డి.ఎల్.రెడ్డి డిగ్రీ కళాశాలల్లో ఆదివారం ఆదికవి నన్నయ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ జట్టు ఎంపికలు నిర్వహించారు. పోటీల్లో 70 మంది క్రీడాకారులు పాల్గొనగా వారిలో 14 మందిని విశ్వవిద్యాలయం జట్టుగా ఎంపిక చేశారు. ముఖ్యఅతిథిగా హాజరైన రిజిస్ట్రార్ కె.వి. స్వామి మాట్లాడుతూ ఉత్తమ ప్రతిభతో అంతర్ విశ్వవిద్యాలయాల కబడ్డీ పోటీల్లో ఆదికవి నన్నయ యూనివర్సిటీకి జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. తమ యూనివర్సిటీ పరిధిలో 395 గుర్తింపు పొందిన కళాశాలలు ఉన్నాయన్నారు. 2006లో ప్రారంభించిన యూనివర్సిటీ తక్కువ కాలంలోనే పెద్ద యూనివర్సిటీగా రూపాంతరం చెందిందన్నారు. అక్టోబర్ 4 నుంచి 7వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రంలోని బెల్గాంలో రాణి చెన్నమ్మ యూనివర్సిటీలో జరగనున్న జాతీయ స్థాయి అంతర విశ్వవిద్యాలయాల పురుషుల కబడ్డీ జట్టు పోటీల్లో తమ యూనివర్సిటీ జట్టు పాల్గొంటుందన్నారు. జి.మామిడాడ ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ– కరస్పాండెంట్ డీ.ఆర్.కె.రెడ్డి మాట్లాడుతూ యూనివర్సిటీ పురుషుల కబడ్డీ సెలెక్షన్స్ తమ కళాశాలలో నిర్వహించేందుకు అనుమతినిచ్చిన యూనివర్సిటీ వీసీ ప్రసన్నశ్రీకి కృతజ్ఞతలు తెలియజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి. శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

రాళ్ల దాడిలో వ్యక్తి మృతి



మృతుడు సత్తిబాబు (ఫైల్)

రాయవరం: సరిహద్దు వివాదం నేపథ్యంలో జరిపిన రాళ్ల దాడిలో పలువురు వ్యక్తులు గాయపడగా, ఒకరు మృత్యువాత పడ్డారు. రాయవరం గ్రామంలో పోలమ్మ అమ్మవారి ఆలయం సమీపంలో ముత్యాలమ్మ అమ్మవారి ఆలయం ఉంది. ఈ ఆలయాన్ని చేర్చి ఉన్న స్థలంలో పోలమ్మ ఆలయ కమిటీ రేకుల షెడ్డు నిర్మాణం చేపట్టింది. దీన్ని ఆనుకుని ఉన్న ఇంటి యజమానికి, పోలమ్మ ఆలయ కమిటీకి కొంతకాలంగా వివాదం ఉంది. ఈ నేపథ్యంలో ఆదివారం రేకు షెడ్డు నిర్మాణం జరుగుతుండగా, పక్కనే ఉన్న భవనంపై నుంచి రేలంగి నాగేశ్వరరావు, అతని కుటుంబ సభ్యులు రాళ్లదాడి చేసినట్లుగా పోలమ్మ ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. తొలుత కారం నీళ్లు చల్లడంతో పాటుగా ఒక్కసారి రాళ్లదాడి ప్రారంభించినట్లు స్థానికులు తెలిపారు. ఊహించని పరిణామానికి బిత్తరపోయిన కమిటీ సభ్యులు గాయాలపాలయ్యారు. ఇటుకరాళ్లతో చేసిన దాడిలో సుమారు ఆరుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో బోదంకి సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు(51) రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో చికిత్స చేస్తుండగానే మృతి చెందాడు. రాళ్లదాడిలో కసిరెడ్డి సత్యవతి, కె.నాగమణి, పూడి సత్తిబాబు, కొతాని దుర్గాప్రసాద్, యాళ్ల సూర్యకుమారి, బలగం నాగమణి, కిల్లి గౌరి గాయపడ్డారు. ఘటనా స్థలంలో రామచంద్రపురం ఇన్‌చార్జి డీఎస్పీ ప్రసాద్ విచారణ నిర్వహించారు.

నిర్మాణ పనులు చేసుకుంటున్న వారిపై నాగేశ్వరరావు అతని కుటుంబ సభ్యులు రౌడీయిజం చేసి ఒకరి మృతికి కారణమయ్యారని, కఠినంగా శిక్షించాలని పోలమ్మ తల్లి ఆలయ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. ఇదిలా ఉంటే మృతుడు సత్యనారాయణ అలియాస్ సత్తిబాబు భార్య వెంకటలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుపై హత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై డి.సురేష్‌బాబు తెలిపారు.



ఘటనా స్థలం వద్ద దర్యాప్తు చేస్తున్న రామచంద్రపురం డీఎస్పీ ప్రసాద్

రావులపాలెం అభివృద్ధికి కృషి చేయాలి



నూతన అధ్యక్షుడు కనికిరెడ్డితో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు



చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన అధ్యక్షుడు కనికిరెడ్డి, కార్యవర్గాన్ని అభినందిస్తున్న మాజీ ఎమ్మెల్యే జగ్గిరెడ్డి

చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం

రావులపాలెం: నూతనంగా ఎన్నికైన చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులు వ్యాపారుల సమస్యలు పరిష్కరించడంతోపాటు, రావులపాలెం అభివృద్ధికి కృషి చేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. స్థానిక సీఆర్‌సీ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం చాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం పూర్వపు అధ్యక్షుడు కర్రి నాగిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా పోతంశెట్టి కనికిరెడ్డి, ఉపాధ్యక్షులుగా కర్రి శ్రీనివాస్‌రెడ్డి, మామిడిశెట్టి సోమరాజు, ఆకుల శివశంకర్, ప్రధాన కార్యదర్శిగా మల్లవరపు సూరిబాబు, సంయుక్త కార్యదర్శులుగా కొవ్వూరి వంశీకృష్ణారెడ్డి, మన్యం ప్రదీప్, మల్లూరి నీలకంఠ దుర్గారావు, కోశాధికారిగా మండవిల్లి నగేష్, సహ కోశాధికారిగా కండిచర్ల వీర వెంకట నాగరాజుతో ఎమ్మెల్యే బండారు ప్రమాణ స్వీకారం చేయించారు. నూతన కార్యవర్గాన్ని అభినందించారు. నూతనంగా ప్రమాణ స్వీకారం చేసిన చాంబర్ ఆఫ్ కామర్స్ సభ్యులను మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అభినందించారు. కనికిరెడ్డికి ఆయన శాలువా కప్పించి అభినందించారు. మాజీ ఎమ్మెల్సీ రెడ్డి సుబ్రహ్మణ్యం, రాష్ట్ర బీసీ కో ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్ పర్సన్ రెడ్డి అనంత కుమారి, రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు కుడుపూడి శ్రీనివాసరావు, సర్పంచ్ తాడేపల్లి నాగమణి, ఉప సర్పంచ్ గొలుగూరి మునిరెడ్డి పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి మృతి



సుజాత మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలిస్తున్న పోలీసులు, హైవే సిబ్బంది

ఆలమూరు: మండలంలోని వివిధ ప్రాంతాల్లో ఆదివారం సాయంకాలం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృత్యువాత పడ్డారు. ఆలమూరు ఎస్సై జి.నరేష్ కథనం ప్రకారం 216 ఏ జాతీయ రహదారిపై జొన్నాడ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో వెలగల సుజాత (45) మృతి చెందారు. కడియం మండలంలోని పొట్టిలంకకు చెందిన సుజాత తన భర్త సూరిబాబుతో కలిసి బైక్‌పై కపిలేశ్వరపురం వెళుతున్నారు. స్థానిక ఏటిగట్టు రోడ్డుకు వచ్చేసరికి ఎదురుగా వెళుతున్న సైక్లిస్టును తప్పించేందుకు సడన్ బ్రేక్ వేయగా వెనుక కూర్చున్న సుజాత రోడ్డుపై పడిపోయారు. అదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి రాజోలు వెళుతున్న ఆర్‌టీసీ బస్సు ఆమె తలపై నుంచి వెళ్లిపోవడంతో సుజాత అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని మండపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై నరేష్ కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్ ఢీకొని..

మండలంలోని చొప్పెల్లలో శనివారం రాత్రి జరిగిన మరో రోడ్డు ప్రమాదంలో రాజమహేంద్రవరానికి చెందిన పసుపులేటి వేణుగోపాలరావు (47) మృతి చెందారు. వివరాలలోకి వెళితే మోరంపూడికి చెందిన వేణుగోపాలరావు కొద్దికాలంగా పుణ్యక్షేత్రమైన వాడపల్లిలో రోజ్ మిల్క్ సెంటర్ ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్నారు. శనివారం రాత్రి ఇంటికి వెళుతుండగా స్థానిక ఇరిగేషన్ లాకుల వద్దకు వచ్చేసరికి తాను నడపుతున్న బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన వేణుగోపాలరావును హైవే, పోలీసు సిబ్బంది అంబులెన్స్‌లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి



ఘటనా స్థలిలో అక్షయ్ మృతదేహం



కడలి అక్షయ్ (ఫైల్)

రాజోలు: స్నేహితుడిని కలిసేందుకు మోటార్ సైకిల్‌పై బయలుదేరిన పశ్చిమగోదావరి జిల్లా కలగంపూడికి చెందిన బీటెక్ విద్యార్థి కడలి అక్షయ్(22) రాజోలు మండలం ములికిపల్లి-కడలి రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. అక్షయ్ తండ్రి కడలి మోహనరావు ఫిర్యాదు మేరకు రాజోలు ఎస్సై రాజేష్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కలగంపూడి గ్రామానికి చెందిన అక్షయ్ చెన్నైలో బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. దసరా సెలవులు పురస్కరించుకుని ఈ నెల 27వ తేదీ రాత్రి కలగంపూడి వచ్చాడు. మర్నాడు ఉదయమే తన స్నేహితుడిని కలిసేందుకు బుల్లెట్ మోటార్ సైకిల్‌పై ములికిపల్లి రాగా లారీ ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చెన్నై నుంచి ఇంటికి వచ్చి తమతో గడపకుండానే కుమారుడు మృతి చెందడం పట్ల తండ్రి మోహనరావు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు.

పేకాట, కోడి పందేలపై దాడి

సఖినేటిపల్లి: మండలంలో కోడి పందేలు, పేకాట స్థావరాలపై పోలీసులు దాడి చేసి కేసులు నమోదు చేశారు. మండలంలోని అంతర్వేదిపాలెంలో నలుగురు పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసి రూ.3,750 నగదు స్వాధీనం చేసుకున్నారు. సఖినేటిపల్లి మూడుతూముల వద్ద కోడి పందేలు ఆడుతున్న ఏడుగురిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ.8,150 నగదు, రెండు పందెం కోళ్లు సీజ్ చేసి కోర్టుకు పంపినట్లు ఎస్సై దుర్గా శ్రీనివాస్ ఆదివారం తెలిపారు.

వాడపల్లి వెంకన్నకు దసరా శోభ

- అత్యధికంగా తరలివచ్చిన భక్తజనం
- ఒక్కరోజు రూ 8.90 లక్షల ఆదాయం



వాడపల్లి క్షేత్రంలో కిక్కిరిసిన భక్తజనం

కొత్తపేట: ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి క్షేత్రం ఆదివారం భక్తజనంతో కిక్కిరిసింది. శనివారం ఇసుక వేస్తే రాలనంత రీతిలో భక్తులు తరలిరాగా దాదాపు ఆ స్థాయిలో ఈ ఆదివారం భక్తజనంతో ఆ క్షేత్రం కిక్కిరిసింది. 'ఏడు శనివారాల వెంకన్న దర్శనం ఏడేడు జన్మల పుణ్య ఫలం' నానుడితో అశేష భక్తజనం తరలిరావడంతో కోనసీమ తిరుమలగా ప్రసిద్ధి చెందిన ఈ క్షేత్రానికి శనివారం రాష్ట్ర నలుమూలల నుంచి అశేష సంఖ్యలో భక్తులు తరలివస్తుండగా మిగిలిన ఆరు రోజులు కూడా అత్యధికంగా భక్తజనం తరలివచ్చి స్వామివారిని దర్శించుకుంటున్నారు. ప్రస్తుతం దసరా సెలవులు, ఆదివారం కావడంతో అత్యధికంగా భక్తులు తరలివచ్చారు. వారితో పాటు ఏడు వారాల నోము పూర్తి చేసుకున్న భక్తులు అష్టోత్తర పూజలు జరిపించుకున్నారు. కొందరు స్వామివారి కల్యాణం చేయించుకున్నారు. అనంతరం స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆదివారం ఒక్కరోజు దేవస్థానానికి రూ.8,90,146 ఆదాయం వచ్చినట్టు డీసీ అండ్ ఈఓ చక్రధరరావు తెలిపారు.

హడలెత్తిస్తున్న ధార్‌గ్యాంగ్



పోలీసులు విడుదల చేసిన గ్యాంగ్ ఫొటోలు

- ఒంటరి మహిళలు, తాళాలు వేసిన ఇళ్లు, శివారుప్రాంతాలే టార్గెట్
- నల్లజర్ల, ప్రత్తిపాడుతో పాటు పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడిన వైనం
- ప్రజలను అప్రమత్తం చేస్తున్న పోలీసులు

రాజమహేంద్రవరం రూరల్: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు షాపులో ఒక గోల్డుషాపులో దుండగులు ఈ నెల 23వ తేదీన షట్టర్ పైకి వంచి అద్దాలు పగలుగొట్టి 11 కిలోల వెండి దొంగతనం చేశారు.

- తూర్పు గోదావరి జిల్లా నల్లజర్ల జంక్షన్ వెనుక ఒంటరిగా నివసిస్తున్న పాకలపాటి సుభద్ర ఇంట్లోకి ఈ నెల 24వ తేదీ రాత్రి నలుగురు దుండగులు వెళ్లి రాళ్లతో ఆమెపై దాడి చేసి 15 కాసుల బంగారం అపహరించుకు పోయారు.
- అంతకు ముందు నెల్లూరు జిల్లా కావలి, పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో సైతం ఈ తరహా చోరీలకు పాల్పడ్డారని సమాచారం.

రంగంలోకి దిగిన పోలీసులు ఈ చోరీలకు పాల్పడుతన్న వ్యక్తులు మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్‌గ్యాంగ్‌గా గుర్తించారు. చోరీలకు పాల్పడిన ప్రదేశాలలో ఒకరి వేలిముద్రలు మధ్యప్రదేశ్‌కు చెందిన నేరస్తుడి వేలిముద్రలతో సరిపోవడంతో పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్‌గ్యాంగ్ ఈ నేరాలకు పాల్పడుతున్నట్లు తేల్చారు.



రాళ్ల దాడిలో గాయపడ్డ నల్లజర్లకు చెందిన సుభద్ర (ఫైల్)

తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్

ధార్‌గ్యాంగ్‌లో నలుగురి నుంచి ఆరుగురు వరకు సభ్యులు ఉంటారన్నారు. వీరికి రాత్రి సమయాల్లో ఒంటరిగా వెళుతున్న మహిళలు, శివారు ప్రాంతాలతో పాటు, తాళాలు వేసిన ఇళ్లే టార్గెట్. ఉదయం సమయంలో ఆటోల్లో రెక్కీ నిర్వహిస్తుంటారు. రాత్రి సమయాల్లో నలుగురు నుంచి ఆరుగురు వెళ్లి చోరీలకు పాల్పడతారు. ఒకవేళ ఇంటిలో ఎవరైనా ఉంటే వారిపై విచక్షణా రహితంగా దాడులు చేసి సొత్తును చోరీ చేస్తుంటారు.

అవగాహన కల్పిస్తున్న జిల్లా పోలీసులు

పోలీసు అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. ఆయా పోలీస్ స్టేషన్‌ల పరిధిలో ఇన్‌స్పెక్టర్లు,ఎస్సైలు శివారు ప్రాంతాల ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రజలు ఒంటరిగా తిరగవద్దని, ముఖ్యంగా అర్ధరాత్రుళ్లు ఎవరైనా తలుపు తడితే తీయవద్దని, వచ్చిన వారు ఎవరో నిర్ధారించుకోవాలన్నారు. దోపిడీలకు, దాడులకు పాల్పడే మధ్యప్రదేశ్‌కి చెందిన ధార్ గ్యాంగ్ తూర్పు గోదావరి జిల్లా పరిసర ప్రాంతాల్లో తిరుగుతోందని పోలీసులు ప్రజలను హెచ్చరిస్తున్నారు. ధార్ గ్యాంగ్ గ్రామాల శివారు ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటున్నట్లు వెల్లడించారు. రాత్రి సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



జిల్లాలో శివారు ప్రాంతాలలో మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్‌గ్యాంగ్ తిరుగుతూ పలుచోట్ల దాడులు చేసి చోరీలకు పాల్పడుతోంది. ఇటీవల నల్లజర్లలో మహిళపై దాడి చేసి బంగారు వస్తువులు చోరీ చేశారు. అనుమానస్పద వ్యక్తులు కనిపిస్తే 112కు ఫోన్ చేయాలి. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దసరా పండగకు ఊరు వెళితే విలువైన బంగారు వస్తువులను బ్యాంకు లాకర్‌లో భద్రపరచుకోవాలి.

– ఎస్.భవ్యకిషోర్, సౌత్ జోన్ డీఎస్పీ

క్రైమ్ పోలీసుల హెచ్చరిక

అమలాపురం టౌన్: మధ్యప్రదేశ్‌కు చెందిన ధార్ గ్యాంగ్ ఇప్పటికే రాష్ట్రంలోని పలు జిల్లాల్లో ఇంటి దొంగతనాలు, ఇతర నేరాలకు పాల్పడుతున్న క్రమంలో ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండాలని కోనసీమ జిల్లా క్రైమ్ పోలీస్ స్టేషన్ ఆదివారం హెచ్చరించింది. ధార్‌గ్యాంగ్‌తోపాటు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లకు చెందిన గ్యాంగ్‌లు కూడా రాష్ట్రంలోకి వచ్చినట్టు సమాచారం ఉందని పేర్కొంది. ఈ గ్యాంగ్ ఒంటరిగా ఉన్న మహిళలను, ఇళ్లను టార్గెట్ చేస్తుందని క్రైమ్ పోలీస్ స్టేషన్ సీఐ గజేంద్రకుమార్ తెలిపారు. ధార్‌గ్యాంగ్‌లోని ఎనిమిది మంది ఫొటోలను పోలీసులు విడుదల చేశారు.